

# సత్యవాక్కు

సంపుటి - 44 అక్టోబర్ - 2022 సంచిక - 3

## క్రైస్తవ మాసపత్రిక

అక్టోబర్ - 2022

సంవత్సర సభ్యత్వము రూ।। 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో |
| మంగళవారం మధ్యాహ్నం | : | 3.00 గం॥లకు నిరీక్షణ ఛానల్‌లో |
| బుధవారం ఉదయం | : | 7.30 ని॥లకు నిరీక్షణ ఛానల్‌లో |
| శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన ఛానల్‌లో |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanicoc.kkd లో**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

### అక్టోబరు విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | మానవుని రక్షించుటకు దేవుని పథకం - పేజీ | 3 |
| 2. | ఆసక్తి జనకమైన బైబిలు వాస్తవములు | 8 |
| 3. | పాత నిబంధన నేనేల చదువ వలెను | 11 |
| 4. | బబులోను హెచ్చరిక | 16 |
| 5. | క్రైస్తవుడు దశమ భాగము | 18 |



**సత్యవాణి**

పోస్ట్ బాక్స్ నెం. 80, కాకినాడ

పిన్ : 533004. ఫోన్ నెం. : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 44 అక్టోబరు - 2022 సంచిక -3

## మానవుని రక్షించుటకు దేవుని పథకము

పాపము నుండి మానవుని రక్షించు నిమిత్తము సర్వశక్తిగల దేవుడు సంకల్పించెను. మానవులు తమ పాపముల అపరాధము నుండి విడుదల పొందవచ్చును. పాపము యొక్క బానిసత్వము నుండి వారు స్వతంత్రము పొందవచ్చును. మరియు మానవులు పాపపు శిక్ష నుండి తప్పించుకొనవచ్చును. అయితే మానవుని రక్షించు దేవుని పథకమును గూర్చి దేవుని గ్రంథము నుండి కొన్ని సంగతులను మీకు వినిపించుగోర్తాను. యేసుక్రీస్తు మరణమునకు లోనై, మరణము నుండి సజీవునిగా లేచిన తరువాత యిట్లు పలికెను; "క్రీస్తు శ్రమపడి మూడవదినమున మృతులలో నుండి లేచుననియు, యోరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడి యున్నది" (లూకా 24:46,47).

మానవుని రక్షించు దేవుని పథకము ప్రకటింపబడవలెను. ఆయన పేరట మారుమనస్సు పాపక్షమాపణ ప్రకటింపబడవలెను. సువార్త ప్రకటన యను వెర్రితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక

సంకల్పమాయెను అని లేఖనములు చెప్పుచున్నవి (1 కొరింధీ 1:21). సువార్తను ప్రకటించుట కొందరికి యిష్టము కాకపోయినను మానవుని రక్షించు దేవుని సంకల్పము బోధింప బడవలసినదై యున్నది. దేవుని సువార్తను బోధించుట యొక్క ప్రాముఖ్యతను మనము గ్రహించ వలెను. మానవుడు జ్ఞానము కలవాడు. తన జీవితములో నిర్ణయములను గైకొను శక్తి గలవాడు. అతడు గైకొను నిర్ణయములు మంచివిగాని చెడ్డవిగాని కావచ్చును. గాని అతడు నిర్ణయము లకు గైకొనవలసి వచ్చును.

సువార్త ప్రకటనలో దేవుని యొక్క సంకల్పము మానవునికి తెలియజేయబడును. మానవుని జ్ఞాన వికాసము కొరకు సువార్త ప్రకటన పనిచేయును. కాని యెవరికిని సేవించెదనోయను నిశ్చయతను మానవుడు గైకొనవలెను ఏలయనగా ఎవడును ఇద్దరు యజమానులకు సేవ చేయలేడు (మత్తయి 6:24). తన జీవితములో ఏ మార్గమందు ప్రయాణించవలెనో మానవుడే నిర్ణయించుకొనివలెను. "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనము నకు పోవు ద్వారము వెడల్పును, ఆదారి విశాలమునై యున్నది, దాని ద్వారా ప్రవేశించు వారనేకులు. జీవ మునకుపోవు ద్వారము ఇరుకును ఆదారి సంకుచితమునై యున్నది, దానిని కనుగొనువారు కొందరే"యని యేసు బోధించెను (మత్తయి 7:13,14).

స్వప్నములద్వారాను, దర్శన ములద్వారాను లేక దేవుని స్వరమును నేరుగా వినుటవలనను ప్రజలు రక్షింప బడరు. మనుష్యులిచ్చే సాక్ష్యము లనుబట్టి వారు దేవుని చిత్తమును తెలిసి కొనలేరు. తమ రక్షణార్ధమైన దేవుని సంకల్పమును, మానవులు దైవప్రేరిత గ్రంధమగు బైబిలును చదువుట ద్వారా మాత్రమే తెలిసికొనగలరు (2తిమో 3: 16,17).

మానవుని రక్షించు పధకములో దేవుని కుమారుని యొక్క మరణము అత్యవుసరమని మనము గ్రహించు టయే గాక లూకా 24:46, 47 ప్రకారము అది ప్రకటింపబడుట కూడ

అత్యవసరమై యున్నది. క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలో నుండి లేచుననియు, అది సమస్తజనులలో ప్రకటింపబడుననియు వ్రాయబడి యున్నది.

మానసిక శాస్త్రము మానవుని పాపములకు ఒక నిజమైన విరుగుడు ను రూపించుటలేదు. పాపము చేసినవాడు అపరాధి, ఈ అపరాధ మును తొలగించునది మానసిక శాస్త్రములో ఏదియునులేదు. అందరును పాపముచేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవు చున్నారు (రోమా 3:23). పాపము యొక్క సమస్యలను పరిష్కరించుటకు తత్వశాస్త్రములో ఏమియునులేదు, పాపముయొక్క ఉనికిని తిరస్కరించి నంత మాత్రమున అవినీతి తొలిగి పోదు. మంచి చెడుగులను దేవుడే నిర్ణయించి ప్రకటించెను.

నైతికముగా మంచి జీవితమును జీవించుచున్నంత మాత్రమున పాపపు సమస్య పరిష్కరింప బడబోదు. మానవులు తమ స్వనీతి క్రియలను బట్టి తమ్మును తాము రక్షించు కొన లేరని బైబిలు విపులముగా బోధించు చున్నది. మానవుని నీతిక్రియలన్నియు దేవుని దృష్టిలో మురికిగుడ్డల వంటి వని యెషయా 64:6లో వ్రాయబడి యున్నది.

పాపము నుండి రక్షింప బడ వలెనంటే మానవులు క్రీస్తు యొక్క మరణముపై ఆధారపడవలెను. దేవుని కుమారుడైన క్రీస్తు రక్తము ద్వారానే పాపము నుండి విమోచన కలుగును. (ఎఫెసీ 1:7). క్రీస్తు రక్తము ద్వారానే పాపక్షమాపణ లభించును (కొలస్స 1: 14). క్రీస్తు యొక్క మరణము ద్వారా పాపమునుబట్టి వేరుపడిన మానవుడు దేవునితో సమాధానపడగలడు (రోమా 5:10). క్రీస్తు యొక్క రక్తము ద్వారానే మానవుడు నీతిమంతుడని తీర్చ బడును (రోమా 5:9).

దేవుని ఆజ్ఞాతిక్రమమే పాపము. ఆజ్ఞాతిక్రమమును బట్టి శిక్ష కలుగుట తప్పదు. పాపమువలన కలుగు జీతము మరణము (రోమా 6:23). అతిపరిశు ద్ధుడైన దేవుడు పాపముతో సహవాసము చేయలేడు. గాని ఆయన మానవుని ప్రేమించి అతని రక్షింప

బూనుకొనెను. మానవులను పాపము నుండి రక్షించు నిమిత్తము దేవుడు మన యతిక్రమములనన్నిటిని యేసుక్రీస్తు పై మోపెను. దేవుడు తన ఏకైక కుమారుని పాపప్రాయశ్చిత్తార్థ బలిగా నర్పించెను. "ఎందుకనగా మన మాయనయందు దేవుని నీతి అగునట్లు పాప మెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" (2కొరింధీ 5:21). మానవుని రక్షించు దేవుని పధకములో క్రీస్తు యొక్క మరణము అత్యవుసరము. ఇది ప్రకటింప బడవలెను. దేవుని యొక్క సంకల్పము లేనిదే మానవులు తమ్మును తామే రక్షించుకొన జాలరని మానవులు ఎరుగవలెను. అంటే పాపము నుండి విమోచించు క్రీస్తు రక్తమునకు వేరుగా మానవుడు రక్షింప బడజాలడు. క్రీస్తు శ్రమపడని యెడల పాపక్షమాపణ దొరకకపోవును. గాని ఆయన మరణము ద్వారా మనకు జీవము ప్రసాదింపబడెను. అందుకే "ఇమ్మానుయేలు రక్తము, ఇంపైన యూటగు, ఓపాపి యందు మన్గుము పాపంబుబోవును" అని మనము పాడుచూ యుంటాము.

మానవులు పాపము నుండి రక్షింపబడుటకు క్రీస్తుయొక్క మరణము అవుసరము. ఆయన సిలువపై మరణించుట ఎంత ప్రాముఖ్యమో మృతులలో నుండి సజీవుడై లేచుటకూడ అంతే ప్రాముఖ్యము. క్రీస్తు మృతులలో నుండి లేచుటయు, మానవులకు పాప క్షమాపణ అనుగ్రహింపబడుటయు అనునవి ఒకదానితో ఒకటి సంబంధము కలిగి యున్నట్లు లూకా 24:46, 47లో మనము చూడగలము. మానవుని పాపములు క్షమించబడ వలెనంటే, క్షమించేవారికి అధికార ముండవలెను. అయితే పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్య కుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెనని యేసు మార్కు 2:10లో చెప్పెను. పరలోక దేవుని ఆజ్ఞను అతిక్రమించుట పాపము గనుక, పాపక్షమాపణ దేవుని పనియై యున్నది. "పాపము చేయు ప్రతివాదును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమే పాపము. పాపములను

తీసివేయుటకై ఆయన ప్రత్యక్ష మాయెనని" భక్తుడైన యోహాను వ్రాసెను (1 యోహాను 3:4,5).

1 కొరింధి 15వ అధ్యాయము లో అపొ. పౌలు క్రీస్తు యొక్క పునరుత్థానమునకును మానవుల పాప క్షమాపణకును గల సంబంధమును చూపించెను. "క్రీస్తు లేపబడని యెడల మీ విశ్వాసము వ్యర్థమే, మీరింకను మీ పాపములలోనే యున్నారు" అని అతడు 17వ వచనములో పలికెను. క్రీస్తు లేపబడని యెడల ఆయన దేవుని కుమారుడు కాదు. గాని ఆయన మృతులలో నుండి పునరుత్థానుడై నందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడగా ప్రభావముతో నిరూపింపబడెను గనుక (రోమా 1:4). పాపములు క్షమించుటకు ఆయనకు అధికారమున్నది. పాపక్షమాపణ ఆయన నామమున ప్రకటించబడవలెనని వ్రాయబడియున్నది. ఆయన నామము అనగా ఆయన అధికారము నుబట్టి అని యర్థము. అందుకే పునరుత్థానుడైన యేసు భూలోకమందును, పరలోకమందును నాకు సమస్తాధికారమీయబడి యున్నదని చెప్పెను (మత్తయి 28:18).

లూకా 24వ అధ్యాయములో మనము చూచిన రీతిగ ప్రభువు నామమున మారుమనస్సు, పాపక్షమాపణలు ప్రకటించుట యెరూషలేములో ఆరంభము కావలసి యుండెను. క్రీస్తు పునరుత్థానుడైన మొదటి పెంతెకొస్తునాడు అది అక్షరాల నెరవేరెను. ఆ దినమున యెరూషలేములో సమకూడిన వేలకొలది యూదులకు యేసుక్రీస్తు సువార్తను మొట్ట మొదటిగా పేతురు ప్రకటించెను. ఆ సువార్తను వినినవారు సహోదరులారా రక్షింపబడుటకు మేమేమి చేయవలెనని అడుగగా, పేతురు "మీరు మారుమనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" అని చెప్పెను (అపొ.కా. 2:37, 38). ఈ ప్రజల పాపక్షమాపణ పొందవలెనంటే వార యేసుక్రీస్తు నామమున లేక ఆయన అధికారమునుబట్టి మారుమనస్సు,

బాప్తిస్మము పొందవలెనని పేతురు చెప్పెను. అతని మాటల నగీకరించిన ఇంచుమించు మూడువేల మంది ఆనాడు బాప్తిస్మము పొందిరి, రక్షింప బడిరి. వారివలె ఈనాడు నీవును యేసు నందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తు నందలి నీ విశ్వాసమును బహిరంగ ముగా ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము బొందిన యెడల, రక్షింపబడుదువు. దేవుడు నిన్ను రక్షించుటకు ఏర్పరచిన ఈ గొప్ప సంకల్పమును నీవెట్లు నిరాకరించగలవు?

## ఆసక్తి జనకమైన బైబిలు వాస్తవములు

బైబిలును 40 మంది 1600 సంవత్సరముల కాలములో అనగా క్రీపూ.1503 నుండి క్రీ.శ.100వ సంవత్సరము వరకు వ్రాయుటలో నిమగ్నులైయుండిరి. ఈ మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై వ్రాసిరి (2పేతురు 1:21). వారు మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మనేర్పు మాటలతో వ్రాసిరి (1 కొరింధి 2:13).

బైబిలులో మొత్తము 66 పుస్తకములు, 1189 అధ్యాయములు, 31,102 వచనములు ఉన్నవి. ఇంగ్లీషు బైబిలు నందు 35,66480 అక్షరములు 77,3746 మాటలు ఉన్నవి. పాతనిబంధనలో 39 పుస్తకములు క్రొత్తనిబంధనలో 27 పుస్తకములు ఉన్నవి. బైబిలు నందున్న ప్రతి మాటలోను సగటున అయిదు అక్షరములున్నవి. పెద్దపెద్ద మాటలను వినియోగింప ప్రగత్నించు వానికి ఇది ఒక గొప్ప పాఠము.

'యెహోవా' అనుపదము 6,855 సార్లును 'ప్రభువు' అను పదము 1853 సార్లును అగుపడును.

ఇంగ్లీషు బైబిలులో 'అండ్' అను పదము 46277 సార్లు కన్పడును. 'రెవరెండ్' అనుమాట ఒకే ఒకసారి కన్పడును (కీర్తన 111.9).

ఎస్తేరు గ్రంథములో 10 అధ్యాయములున్నవి గాని ప్రభువు అను పదముగాని, దేవుడు అను పదము గాన అందులో కన్పించదు.

బైబిలు అంతటిలోను చిన్న దియు, మధ్యగాయున్నట్టియునగు అధ్యాయములో 117వ దా.కీర్తన అందులో కేవలము రెండు వచనములు మాత్రమే యున్నవి.

బైబిలులోని మధ్యవచనము కీర్తన 118:8.

యోబు 29వ అధ్యాయము పాతనిబంధనలో మధ్య అధ్యాయము. 2వ దినవృత్తాంతములు 20:13 పాత నిబంధనలో మధ్యవచనము.

1 దినవృత్తాంతము 1:25 పాతనిబంధనలో బహుచిన్న వచనము. అయితే ఎస్తేరు 8:9 అందున్న పెద్దవచనము.

క్రొత్త నిబంధనలో మధ్యనున్న పుస్తకము 2 థెస్సలోనీకయులకు వ్రాయబడిన పత్రిక. రోమా 13, 14 అధ్యాయముల మధ్య క్రొత్తనిబంధనలో మధ్యనున్న అధ్యాయమున్నది అపొ. కా. 17:17 క్రొత్తనిబంధనలో మధ్య వచనము. క్రొత్త నిబంధనలోను, బైబిలు అంతటిలోను బహుచిన్న వచనము యోహాను 11:35.

బైబిలులో పెద్దవదము యెషయా 18:1లో కన్పడును.

2 రాజులు 19అధ్యాయము, యెషయా 37వ అధ్యాయము ఇంచు మించు ఒకే రీతిగ యున్నవి.

బైబిలు మొట్టమొదటిగా అచ్చు వేయబడిన గ్రంథము. అది 1450లో అచ్చువేయబడెను. ఇండియాలో 1806లో హిందీలో లేఖనములు కొన్ని మొదటిసారిగ ముద్రింపబడెను.

1727లో తమిళంలో మొదటిగా బైబిలు ముద్రింపబడెను. 1854లో అది తెలుగులో అచ్చువేయబడెను.

1814లో తమిళంలో

మొదటిగా బైబిలు ముద్రింపబడెను. 1854లో అది తెలుగులో అచ్చువేయ బడెను.

1814లో ఉర్దూలో క్రొత్త నిబంధన మొదట ముద్రింపబడెను. 1843లో బైబిలు అంతయు ఉర్దూలో ముద్రింపబడెను.

విల్లియం కేరీ, హెన్రీ మార్టిన్, విల్లియం బౌలీ, తామస్‌కోల్ బ్రూక్ అనువారలు మొదటి తర్జుమాదారు లలో కొందరు.

1971లో 8072000 మందికి బైబిళ్ళు, క్రొత్తనిబంధనలు, వాక్యభాగ ములు హిందూదేశములో అందజేయ బడెనని బైబిలు సొసైటీ ఆఫ్ ఇండియా వారు తెలియజేసిరి.

గత కొద్ది సంవత్సరములలోను బైబిలు నాలుగు క్రొత్త భాషలలోనికి తర్జుమా చేయబడెను. వాటితో కలిపి భారతదేశములో బైబిలు 37 భాషల లోనికి క్రొత్తనిబంధన 24 భాషలలోనికి వాక్యభాగములు 87 భాషలలోనికి తర్జుమా చేయబడెను.

ఆంగ్లములో కింగ్ జేమ్స్ వెర్షన్ బైబిలుల 1611లో మొదట ప్రచురింప బడెను. 1885లో రివైజడ్ వెర్షన్ తయారు చేయబడెను.

కార్డినల్ హ్యుగో అనునతడు బైబిలును అధ్యాయయులుగ విభజిం చెను. సర్ రాబర్ట్ స్టీవెన్స్ అనునతడు క్రొత్త నిబంధనను వచనములుగ 1551లో విభజించెను.

అధ్యాయములుగను, వచనము లుగను విభజింపబడిన మొత్తము బైబిలు అంతయు 1560లో తయార య్యెను. దానిని 'జెనీవా బైబిలు' అని పిలుచుటకద్దు. సవరణోద్యమకారుల చే అది జెనీవాలో తయారుచేయబడెను గనుక దానిని అట్లు పిలిచిరి.

ప్రపంచములో పెక్కు భాషలలో నికి తర్జుమా చేయబడిన గ్రంథము బైబిలు. మరియే గ్రంథముకూడ అన్ని భాషలలోనికి ఎన్నడును తర్జుమా చేయ బడి యుండలేదు. ప్రపంచమందం తటా బైబిలు గ్రంథమే ఎక్కువ అమ్మడ గుచున్న గ్రంథము.

మానవుని ఉద్భవమును గూర్చి, అతని కృషినిగూర్చి అతని గతినిగూర్చి తెలియజేయు గ్రంధము అది ఒక్కటి మాత్రమే. రక్షణను గూర్చి అది ఒక పాఠ్యపుస్తకమై యున్నది.

బైబిలునకును, విజ్ఞాన శాస్త్రవాస్తవములకును మధ్య విభేదములు ఏమియును లేవు. బైబిలునకుకు శాస్త్రజ్ఞులమని చెప్పుకొనువారి సిద్ధాంతములకును విభేదములుండ వచ్చును: లేదా విజ్ఞాన శాస్త్రపు వాస్తవములకును 'బైబిలుపండితులము' అవి చెప్పుకొనువారి సిద్ధాంతములకును విభేదములుండవచ్చును.

అన్నిటికంటెపైగా బైబిలును చదివి, దానికి విధేయత చూపించవలెను. దానిని బోధించవలెను.

-జె.సి. ఫోట్

## పాత నిబంధన నేలచదువ వలెను?

అపో.పౌలు విశ్వాసమును బట్టి తన కుమారుడని యెంచిన యౌవన సువార్తికుడగు తిమోతికి ఈలాగున వ్రాసాడు: "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము" (2తిమోతి 2:15). ఇదే హెచ్చరికను ఈనాడు మనంకూడా వినాలి. దేవుని వలన మెప్పు పొందేలాగ మనం మెలగాలి. అట్లు చేస్తే దేవుని యెదుట యోగ్యునిగాను మన పనిలో సిగ్గుపడు నక్కరలేనివానిగాను మనం తయారగుదుము. అయితే మనం దేవుని సంతోషరచాలంటే యేమి చేయాలో, ఆయన మననుండి యేమి కోరుచున్నాడో తెలిసికోవాలంటే మనం ఆయన వాక్యాన్ని దీర్ఘంగా చదువుచూ ధ్యానిస్తూ యుండాలి.

క్రైస్తవులవలె మనం క్రొత్త నిబంధన యొక్క ప్రాముఖ్యతను ఎరుగ

కుండా యుండలేము. తత్ఫలితంగా మనం బైబిలు పఠనమంటా క్రొత్త నిబంధనమీదే ఆధారపడి యున్నట్లుగు పడుచున్నది. విచారకరమైన సంగతి యేమంటే మనలో చాలమంది పాత నిబంధనను యెరుగకున్నారు. దానిలోని వ్యక్తులనుగూర్చి చారిత్రక సంఘటనలను గూర్చి కొంతమట్టుకు మాత్రమే మనం ఎరిగియున్నాము.

క్రొత్తనిబంధన పఠనము యొక్క ప్రాముఖ్యత గొప్పదే. ఈ అంత్యదినాల్లో మనం కృపవలన కలిగిన నిబంధన క్రింద యున్నాము. యేసుక్రీస్తు నందలి విశ్వాసము ద్వారా మనం రక్షణ పొంద గల్గుచున్నాము గాని మోషే యుగంనాటి ధర్మశాస్త్ర పద్ధతుల ననుసరించి కాదు (ఎఫెసీ 2:1-11; యోహాను 1:17). మానవునికి దేవుని పరిపూర్ణమైన అంతిమ బయల్పాటే క్రొత్త నిబంధన. అందుకే అపొ.పౌలు ఇట్లు చెప్పాడు: "మేము మీకు ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తను మేమైనను పరలోకము నుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక. మేమిదివరకు చెప్పిన ప్రకారమిప్పుడును మరల చెప్పుచున్నాము. మీరు అంగీకరించిన సువార్త గాక మరియొకటి యెవడైనను మీకు ప్రకటించిన యెడల వాడు శాప గ్రస్తుడవును గాక" (గలతీ 1: 8,9) అది పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింప బడిన బోధ (యూదా : 3).

క్రొత్త నిబంధన యొక్క ప్రాముఖ్యతను గూర్చి చెప్పుచు మనం పాతనిబంధన యొక్క పఠనాన్ని నిర్లక్ష్యం చేయుచున్నాము. అందు వలన దేవుని చిత్తము యొక్క బయల్పాటులోని సౌందర్యాన్ని, మాధుర్యాన్ని మనం తెలిసికోలేకపోవు చున్నాము. పాత క్రొత్త నిబంధనల సరియైన సంబంధాన్ని తెలిసికోలేక పోవుటవలన ఇది జరుగుచున్నది. దేవుని చిత్తం అంతటిలో ఈ రెండూ ప్రాముఖ్యమే.

లేఖనములన్నియు దైవావేశము

వలన కలిగినవే. ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి (2 పేతురు 1:21). క్రీస్తుయేసు నందుంచవలసిన విశ్వాసము ద్వారా రక్షణార్థమైన జ్ఞానము కలిగించే శక్తి లేఖనముల యందున్నదని చెప్పబడింది (2 తిమో 3:14). మరియు ఈ సత్యవాక్యాన్ని సరిగా విభించిన యెడల దేవుని యెదుట యోగ్యునిగా కనబడే తరుణం మనకు దొరుకునని గమనించాం. ఈ వచనాలన్నీ బైబిలు యొక్క విలువను మనకు తెలియజేయుచున్నను, ప్రాధమికంగా వాటిలో చెప్పబడిన లేఖనములు పాతనిబంధన లేఖనములని మనం తెలిసికోవాలి. అందువలన పాత నిబంధనను చదువుట మనం నిర్లక్ష్యం చేయరాదు.

**మనకు బోధ కలుగును**

పాతనిబంధనవలన మనకు బోధ కలుగు నిమిత్తము అది వ్రాయబడింది. "ఏలయనగా ఓర్పువలనను, లేఖనములవలన, ఆదరణవలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధకలుగు నిమిత్తము వ్రాయబడియున్నవి" (రోమా 15:4). దేవుడు మానవుని సృష్టించిన నాటి నుండి మొదలుకొని ఇశ్రాయేలీయులు బబులోను బానిసత్వము నుండి విడుదల పొందువరకు యున్న చరిత్రాత్మక రికార్డు అది. అది హెచ్చరించడానికి, గద్దించడానికి, బోధించడానికి ప్రయోజనకారియై యున్నది. తిరుగుబాటును గూర్చి అవిధేయతను గూర్చి మనలను అది హెచ్చరించుచున్నది (1కొరింధీ 10:1-13). దేవునికి నమ్మకంగా సేవచేయుట కది ప్రోత్సహించుచున్నది. ''ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించి యున్నందున మనము కూడ ప్రతిభారమును సుళువుగా చిక్కుల

బెట్టు పాపమును విడిచిపెట్టి విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము" (హెబ్రీ 12:1, 2). క్రొత్త నిబంధనలోయున్న దేవుడే పాతనిబంధనలోయున్న దేవుడు. ఆయన తన ప్రజల నుండి ఎల్లప్పుడు విశ్వాసము విధేయతలనే కోరాడు. ఆయా సందర్భాలు, స్థలాలు మారవచ్చును గాని ఆయన యొక్క సూత్రాలు మాత్రం మారనివి.

### క్రొత్త నిబంధన అర్థం చేసుకోగలం

ఇంకా, పాత నిబంధనను మనం చదివేకొలదీ క్రొత్త నిబంధనను అర్థం చేసుకోడానికి వీలవుతాది. క్రొత్త నిబంధన యొక్క మూలం అంతా ఎక్కువ పాతనిబంధనలోనే వున్నది. పాత నిబంధనలోని వచనాలు, సందర్భాలు క్రొత్త నిబంధనలలో 650 సార్లు కంటే ఎక్కువ ఎత్తి చూపించబడినవి. పాత నిబంధనను కొంత వరకైనా ఎరుగకుండా క్రొత్త నిబంధనను మనం అర్థం చేసుకొనలేము. పాతనిబంధనను మనం అర్థం చేసుకొనే కొలదీ క్రొత్త నిబంధనను అర్థం చేసుకోగలం.

### చారిత్రక వాస్తవములు

చరిత్రలోని వాస్తవాలను మనకు పాతనిబంధన నమ్మతగినదని, యథార్థమైనదని యేసే మనకు తెలియజేసారు. (మత్తయి 19:4; 22:29). దేవుని యొక్క ఉనికిని గూర్చి, సృష్టిని గూర్చి, మానవుని ఆరంభాన్ని గూర్చి, జలప్రళయాన్ని గూర్చి మొదలైన అట్టి వాటిని గూర్చి మనకు ఖచ్చితమైన సమాచారం ఇంకెక్కడ దొరకును? వీటిని గూర్చి అక్కడక్కడా మనకు కొంత సమాచారం దొరుకుతుంది గాని అది అంత నమ్మతగినది కాదు. అధికారయుక్తమైనదికాదు. పాతనిబంధన యథార్థమైనది మాత్రమే కాదు గాని అది అధికారయుక్తమైనది. ఆత్మావేశముచే లిఖింపబడిన సత్యమని నిరూపించుకొన్నది.

పాతనిబంధన ఈ లోకరక్షకుడగు యేసుక్రీస్తును సూచించుచున్నందున ముఖ్యంగా దాన్ని మనం పఠనం చేయాలి. మోషే ధర్మశాస్త్రాన్ని నిత్యము ఉండేదిలా దేవుడు ఉద్దేశించలేదని పాతనిబంధన విపులంగా బయలు పరచుచున్నది. ''ఇదిగో నేను ఇశ్రాయేలు వారితోను, యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములువచ్చుచున్నది...''యని ఆయన చెప్పారు (యిర్మియా 31:31 -34). మోషేధర్మశాస్త్రము ఒక ప్రత్యేక ప్రయోజనం కొరకు తాత్కాలికంగా ఉద్దేశించబడినదని అపొ.పౌలు చెప్పాడు. ఆ ప్రయోజనం నెరవేరిన తరువాత దాని అవసరత ఇక లేకపోవును (గలతీ 3:10-25).

మెస్సీయను గూర్చి ఆయన రాజ్యాన్ని గూర్చి పాతనిబంధనలో 400 కంటే పైగా ప్రవచనములున్నవి. అంతే గాకుండా దానిలోని కొన్ని సందర్భములు, వ్యక్తులు, సంస్థలు క్రీస్తుకు మాదిరిగాను, రాబోవు సంగతుల ఛాయగానుయున్నవి. "లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుడి. అవే నన్నుగూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి" యని యేసుప్రభువు చెప్పారు (యోహాను 5:39).

వీటన్నిటినిబట్టి పాతనిబంధనను చదువుట అవుసరం అని మనం గ్రహించుకోగలము. మనం పాత నిబంధనకు బద్ధులము కాకపోయినను దాన్ని చదువుట అత్యవసరం. క్రీస్తు ప్రభువును, ఆయన రక్షణమార్గాన్ని, ఆయన సంఘాన్ని మరింత అర్థం చేసుకోవాలంటే పాతనిబంధన లేఖనాలను చదువుట అవుసరం. "కావున మనము వినిని సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగి యుందము" (హెబ్రీ 2:1)

\- జాషువాగూటం

# బబులోను హెచ్చరిక

"అప్పుడు రాజ్యములకు భూషణమును కల్దీయులకు అతిశయాస్పదమును మహాత్మ్యమునగు బబులోను దేవుడు పాడుచేసిన సొదొమ గొమొఱ్ఱాల వలెనగును. అది మరెన్నడు నివాసస్థలముగా నుండదు. తరతరములకు దానిలో ఎవడును కాపురముండడు. అరబీయులలో ఒక్కడైనను అక్కడ తన గుడారము వేయడు. గొఱ్ఱెల కాపరులు తమ మందలను అక్కడ పరుండనియ్యరు. నక్కలు అక్కడ పండుకొనును, గురు పోతులు వారి యిండ్లలో ఉండును. నిప్పుకోళ్ళు అక్కడ నివసించును. కొండమేకలు అక్కడ గంతులు వేయును" (యెష 13:19-21).

బహుశ బబులోను కంటె సుందరమైనది, గొప్పదైనది మరొక పట్టణము లేదు. అది బహు పురాతన మైన పట్టణం, అది బహుశ ఆదికాండము 11:9లో చెప్పబడిన బాబెలు గోపురము కావచ్చును. 'బబులోను' అనగా దేవుని గుమ్మము అని యర్థము. బాబెలు అంటే తారుమారు అని యర్థము. లేఖనములలో దాని కున్న ప్రాముఖ్యత అట్టిది.

బబులోను మహాపట్టణాన్ని వర్ణించుటకు మనకు స్థలము చాలదు గాని అవి చతురస్రాకారముగ కట్టబడెను. దానికి నాలుగు ప్రక్కల 325 అడుగుల ఎత్తు, 85 అడుగుల మందముగల గోడలు కట్టబడెను. ఒక్కొక్క గోడ 15 మైళ్ళ పొడవు వుండెను. ఒక్కొక్క గోడలో 15 పెద్ద యిత్తడి గుమ్మములుండేవి. ప్రతి గుమ్మము నుండి దానికి ఎదురుగా యున్న గోడలోని గుమ్మము వరకు విశాలమైన వీధులుండేవి. ఈ విధంగా పట్టణమంతా 576 పెద్ద చతురస్ర భాగాలుగా విభజింపబడ్డాయి. వీటి లోపలి స్థలములు తోటలుగా చేయబడితే, బయట అంచులలో యిండ్లు నిర్మించబడ్డాయి.

నాటి విజ్ఞాన శాస్త్రములోని

ప్రతిశాఖ అక్కడే ఆరంభించబడెను. గనుక, తూర్పుదేశపు నాగరికత అంతా, నెలలు, వారములు, సంవత్సరములు సమయము మొదలగు వాటి లెక్క కొరకు బబులోను మహాపట్టణము వైపే చూచేవారు. సూర్య గడియారములను, నీటి గడియారములను ఐగుప్తు బబులోను నుండి తీసుకొని వెళ్ళేది. అది ఎంత ఘనకీర్తి నొందిన పట్టణమంటే అది ఎన్నడు నాశనం కాదని దాని రాజులు ప్రజలు తలంచే వారు గాని, వారు తప్పు! వారు అజాగ్రత్త పరులయ్యారు. పాపభోగాలలో మునిగి పోయి, వారు దేవుని మరచారు. దేవుడు ఈ మహా పట్టణముపై తన తీర్పును ప్రకటించాడు. దేవుడేమైతే శాసించాడో దానిని నెరవేరుస్తాడని బబులోను గూర్చిన హెచ్చరిక మనకు తెలియజేయుచున్నది. దేవుడెంత ఖచ్చితంగా తీర్పు చెప్పాడో అంత ఖచ్చితంగా పూర్తిగా అది నెరవేరింది. అది నాశనము చేయబడతాదని ప్రవక్తలు ముందుగనే హెచ్చరిక చేసారు, గాని ప్రజలు దానిని ఖాతరు చేయలేదు.

బబులోను మహాపట్టణం నాశనం చేయబడింది. అట్లే నేడు దేవుని మరచి ఆయనకు అవిధేయత చూపుచు జీవించు వారందరు నాశన మవుతారు. గతంలో దేవుడిచ్చిన హెచ్చరికల దృష్ట్యా ఇప్పుడు మనం ఆయనకులోబడుటకు ప్రోత్సహించ బడాలి. నీవు మరణం, తీర్పు, నాశనములను గూర్చి ఎన్నడైనా ఆలోచించావా? పరలోకానికి నరకానికి గల తారతమ్యాన్ని ఎన్నడైనా గమనించావా? ఒకడు పరలోకాన్ని పోగొట్టుకొంటే, అంతా పోగొట్టు కొన్నట్లే. మరణం వస్తాదని ఆ తరువాత తీర్పు జరుగునని అందరు ఎరిగినదే. అయితే మనం చేసిన పొరబాటు మరణించిన తరువాత తెలిసికొన్నట్ల యితే దానిని రైటు చేయడానికి ఒక సమయం యేమి వుండదు. ఎందువల నంటే మరణానంతరం ఇకవున్నది తీర్పే.

–రాబర్ట్ ఎమ్. వాలర్.

# క్రైస్తవ్యుడు దశమ భాగము

లేఖనభాగము : 2 కొరింథీ 9:6

పరిచయం

1. ఈ మధ్య కాలములో ఫేస్‌బుక్‌లో నాతో ఒకరు సంభాషించారు.
2. నేను దశమ భాగము ఇవ్వమని ఎక్కడ వుంది అని అడిగినందుకు ఇవ్వ కూడదు అని ఎక్కడ వుందో చెప్పుచున్నారు. దానికి కొందరు లైకులు కూడ కొట్టారు.
3. ఈ కాలములో దేవునికి ఇచ్చుట విషయములో దేవుడు ఏ నియమమును నియమించెనో తెలుసుకోవడం అవుసరము.
4. ఈ ప్రసంగములో ఈ విషయములను పరిశీలించుదాము.

ఎ. వారు చేసిన వాదన పరిశీల

బి. దశమ భాగము ఇవ్వమని దేవుడు క్రైస్తవులను ఆజ్ఞాపించాడా? లేదా?

సి. సంఘ కార్యక్రమములకు సొమ్ము ఎట్లాగ సమకూర్చాలి?

డి. దశమ భాగము ఇవ్వాల వద్దా?

వాక్య పరిశీలన :

1. వారు చేసిన వాదన (దశమ భాగము ఇవ్వకూడదు అని ఎక్కడ వుందో) పరిశీలన

ఎ. మనము హోటల్‌కి వెళ్ళి దోశ ఆర్డర్ చేసాము అనుకోండి :

1. "దోశ కావాలి" అని చెప్పామా? లేక
2. ఇడ్లీ వద్దు, పూరి వద్దు, మసాల దోశ వద్దు... అని మెనులో వున్న మిగతివి వద్దు అని చెప్తామా? లేదే!

బి. దేవుడు కూడ అంతే, ఆయనకు కావలసింది చెప్తారు అంతే. ఆయనకు అక్కర్లేని సంగతులు చెప్పుకుంటూ పోతే బైబిలు ఇంకా వ్రాస్తూనే వుందురు. ఈ విషయము అర్థం చేసుకొనుటకు రెండు ఉదాహరణలు చూద్దాము.

1. ఉదా 1: నోవహును ఓడ కట్టమన్న దేవుడు, ఎలా చెయ్యాలో చెప్పారు (ఆది. 6:14-16).

ఎ. "చితిసారకపు మ్రానుతో నీకొరకు ఓడను చేసికొనుము" (14వ వచనము).

1. చితిసారకపు మ్రాను కావాలని చెప్పినప్పుడు మిగతా మ్రానులు వాడొద్దు అని చెప్పనవసరము లేదు.

2. నోవహు ఇంక వేరొక మ్రాను ఉపయోగించి వుంటే ఆ ఓడ మునిగి పోయేది.

బి. "నీవు దాని చేయవలసిన విధమిది; ఆ ఓడ మూడువందల మూరల పొడుగును ఏబది మూరల వెడల్పును ముప్పది మూరల యెత్తును గలదై యుండవలెను" (15వ వచనము).

1. "ఆ ఓడ మూడువందల మూరల పొడుగు" వుండవలెనని దేవుడు నిర్ణయించారు. నోవహు దేవుడు చెప్పిన దానికన్న ఎక్కువ పొడుగు గాని తక్కువ గాని చేస్తే ఆ ఓడ మునిగిపోయేది.

2. "ఏబది మూరల వెడల్పును" వుండవలెనని దేవుడు నిర్ణయించారు. నోవహు దేవుడు చెప్పిన దానికన్న ఎక్కువ వెడల్పు గాని తక్కువ వెడల్పు గాని చేస్తే ఆ ఓడ మునిగిపోయేది.

సి. "ముప్పది మూరల యెత్తును" వుండవలెనని దేవుడు నిర్ణయించారు. నోవహు దేవుడు చెప్పిన దానికన్న ఎక్కువ యెత్తు గాని తక్కువ గాని చేస్తే ఆ ఓడ మునిగిపోయేది.

డి. "నోవహు అట్లుచేసెను; దేవుడు అతని కాజ్ఞాపించిన ప్రకారము యావత్తు చేసెను" (22వ వచనము).

1. నోవహు దేవునితో వాదించలేదు.

2. దేవుడు ఆజ్ఞాపించనివి చెయ్యలేదు.

3. అలా చెయ్యడం వలన తనను, తన కుటుంబమును కాపాడు కున్నాడు.

**2. ఇంకో ఉదాహరణ అనగా అహరోను కుమారులైన నాదాబు అబీహులు (లేవీ 10వ అధ్యాయం)**

ఎ. "అహరోను కుమారులైన నాదాబు అబీహులు తమ తమ ధూపార్తులను తీసికొని వాటిలో నిప్పులుంచి వాటిమీద దూపద్రవ్యమువేసి, యెహోవా తమ కాజ్ఞాపింపని వేరొక అగ్నిని ఆయన సన్నిధికి తేగా" (1వ వచనము).

1. క్లియర్‌గా ఇక్కడ వారు "యెహోవా తమ కాజ్ఞాపింపని వేరొక అగ్నిని ఆయున సన్నిధికి'' తెచ్చియున్నారు.
2. ఇది దేవుని ఆజ్ఞకు విరుద్ధము.

బి. "యెహోవా సన్నిధి నుండి అగ్ని బయలుదేరి వారిని కాల్చివేసెను; వారు యెహోవా సన్నిధిని మృతి బొందిరి" (2వ వచనము).

1. దేవుడు వారిని శిక్షించారు.
2. "అజ్ఞాతిక్రమమే పాపము" (1 యోహాను 3:4).
3. "ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము'' (రోమీయులకు 6:23).

సి. ఇక్కడ చెప్పిన ఉదాహరణలకు దశమభాగమునకు యేమి సంబంధము? అని మీరు అడగవచ్చు.

1. నన్ను అడిగిన ప్రశ్నకు జవాబు చెబుతున్న.
2. దశమ భాగము ఇవ్వమని ఎక్కడ వుంది అని అడిగినందుకు ఇవ్వకూడదు అని ఎక్కడ వుందో చెప్పుమన్నారు.

**దశమభాగము ఇవ్వమని దేవుడు క్రైస్తవులను ఆజ్ఞాపించాడా లేదా?**

ఎ. క్రొత్త నిబంధన అంతటిలో ఎక్కడ కూడ లేదు.

1. అందుకే దశమ భాగము అడిగే వారు బైబిలు రెఫరెన్స్ చెప్పకుండ అన్ని చెబుతారు. అడిగే వారిని దూషిస్తారు.
2. "అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు

కాక తమ కడుపునకే దాసులు" (రోమీ 16:18).

బి. దేవునికి ఇచ్చిన విషయములో క్రొత్త నిబంధనలో చెప్పబడినది ఏమిటి?

1. "పరిశుద్ధుల కొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగు చేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" (1కొరింథీ 16:1,2).

ఎ. గమనించండి పౌలు గలతీయులకు కూడ ఇదే విషయము నియమించాడు.

బి. ఇప్పుడు కొరింథీ సంఘమునకు అదే సంగతి ఆజ్ఞాపించారు.

2. అక్కడ దశమ భాగమా లేదా కొంత సొమ్మా?

ఎ. కొంత సొమ్ము

బి. దశమ భాగము దేవుడు కోరుకుంటే పౌలు అక్కడే చెప్పేవాడు.

**మరి సంఘ కార్యక్రమములకు సొమ్ము ఎట్లాగ సమకూర్చాలి.**

ఎ. సభ్యులు మనస్సు పూర్తిగ ఇచ్చిన వాటిలోనే చెయ్యవలెను.

1. బోధకుడు డిమాండ్ చెయ్యకూడదు.

ఎ. డిమాండ్ చేసిన వాడు దేవుడు ఆజ్ఞాపించనిది ఆజ్ఞాపిస్తున్నాడు.

బి. డిమాండ్ చేసే వాళ్ళు అయితే క్రీస్తే చేసేవారు, అపొస్తులులే చేసేవాళ్ళు.

2. "సణుగుకొనకయు బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనినప్రకారము ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును'' (2కొరింథీ 9:7).

బి. మొదట శతాబ్ధపు క్రైస్తవ్యులు వారు 100% ఇచ్చారు (అపొ.కా. 4వ అధ్యాయము).

1. "భూములైనను ఇండ్లయినను కలిగిన వారందరు వాటిని అమ్మి, అమ్మిన వాటి వెలతెచ్చి అపొస్తలుల పాదములయొద్ద పెట్టుచు వచ్చిరి" (అపొస్తలుల 4:34).

2. "కొంచెముగా విత్తువాడు కొంచె ముగా పంటకోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయును అని యీ విషయమై చెప్పవచ్చును" (2 కొరింథీ 9:6).

### చివరగ ఏమిటి దశమ భాగము ఇవ్వాలా? వద్దా?

ఎ. మీ హృదయములో నిశ్చయించు కొనిన యెడల - తప్పకుండ.

1. హృదయములో నిశ్చయించు కొనిన తర్వాత అందులో తక్కువ చెయ్యకూడదు.

2. ఉదా. అపొస్తలుల కార్యములు 5 : 1-10?

బి. మీ హృదయములో 5% నిశ్చయించుకొనిన యెడల అది తప్పా?

1. కానే కాదు.

2. దేవుడు కొంత సొమ్ము అన్నారు అది యెంత అనేది డిసైడ్ చేసేది విశ్వాసి గాని బోధకుడు కాడు.

3. కాని, "కొంచెముగా విత్తువాడు కొంచెముగా పంటకోయును, సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంటకోయును అని యీ విషయమై చెప్పవచ్చును" (2 కొరింథీ 9:6) వచనాన్ని జ్ఞాపకము పెట్టుకొని ఇవ్వండి.

### ముగింపు :

1. వారు చేసిన వాదన పరిశీలన.
2. దశమ భాగము ఇవ్వమని దేవుడు క్రైస్తవులను ఆజ్ఞాపించరా లేదా?
3. సంఘ కార్యక్రమములకు సొమ్ము ఎట్లాగ సమ కూర్చాలి?
4. దశమ భాగము ఇవ్వాలా వద్దా?

- రోనీ గూటం

# సంక్షిప్తవార్తలు

2022 సెప్టెంబరు 23వ తేదీ బుధవారం మధ్యాహ్నం రిక్కీ గూటం గారు తన ఆరు వారముల పర్యటన ముగించుకొని క్షేమముగా కాకినాడ చేరుకొన్నారు. అమెరికాలో యుండగా పలుచోట్ల భారతదేశంలో జరుగుచున్న పనిని గూర్చి తెలియ జేసిరి. సెప్టెంబరు 12వ తేదీనాడు హెండర్సన్, టెన్నీసీలో యున్న ఫ్రీడ్ హార్డియన్ యూనివర్సిటీ వారి ఆహ్వానము మేరకు అక్కడి యువతీ యువకులనుద్దేశించి గొప్ప ప్రసంగము చేసిరి. ఆ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు రిక్కీ గారిని అభినందించిరి.

సెప్టెంబరు 10, 11 తేదీలలో జాషువా దంపతులు, రోనీగూటం గారు కుటుంబసమేతముగా మిస్సోరి రాష్ట్రములో బ్రూస్పింగ్ వెళ్ళి అక్కడ మూడు దినములు గడిపిరి. 11వ తేదీ ఆదివారం జాషువా గారు అక్కడ సంఘములో బైబిలు క్లాసులోను, ఆరాధనలోను వాక్యపరిచర్య చేసిరి. సెప్టెంబరు 17, 18 తేదీలలో ఇండియానాలోయున్న సహోదరులు జాన్‌ఫోర్డ్ గారిని ఆయన కుటుంబమును దర్శించిరి. జాన్‌ఫోర్డ్ గారు చాలాకాలము కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌కు సహాయ పడిరి. అక్కడ గొప్ప భవన నిర్మాణమునకు సహాయపడిరి. మూడు సంవత్సరముల క్రితం తీవ్రమైన కారు యాక్సిడెంట్‌లో చిక్కుకొని, నాటి నుండి మంచమునకే పరిమితమయ్యిరి. పక్షవాతము వలన ఆయన తన సహజచలన శక్తిని కోల్పోయారు. కంప్యూటర్ ద్వారా చలించే కుర్చీలో కూర్చొని ఆయన ఆరాధనకు హాజరగుచున్నారు. ఆయన సతీమణి నేన్సీఫోర్డ్‌గారు గొప్ప పరిచర్యచేయుచు క్రీస్తునందలి విశ్వాసముతో ధైర్యముగానే యున్నారు. జాన్‌ఫోర్డ్ గారి కొరకు, ఆయన కుటుంబసభ్యుల కొరకు ప్రార్థించ మనవి.

సెప్టెంబరు 24వ తేదీ నుండి 26 తేదీ వరకు సోదరులు గేరీ జోన్స్ గారు కాకినాడలో సువార్త పరిచర్యలో పాల్గొనిరి. ఆదివారం ఆరాధనలో చక్కటి వాక్య పరిచర్య గావించిరి. ఆయన అస్సాం రాష్ట్రములో గత 15 సంవత్సరములుగా కాపురముంటూ, స్కూళ్లు స్థాపించి, వ్యవసాయము కూడ చేయుచు ప్రభువు సేవలో తోడ్పడుచున్నారు.

సత్యవాణి స్కూల్ ఆఫ్ ఎవాంజలిజమ్ ఆన్‌లైన్‌లో నిరాటంకముగా నడుచు చున్నది. దేశమంతటా వాక్యమును గూర్చి ఆసక్తిగల అనేకులు శ్రద్ధతో వాక్యము నేర్చుకొనుచున్నారు. ఆ స్కూల్‌లో చేరదలచినవారు సత్యవాణి ఆఫీసుకు ఫోన్‌చేసి

వివరములు తెలిసికొనగలరు.

2022 సెప్టెంబరు 7వ తేదీనాడు కాకినాడ క్రీస్తుసంఘ సభ్యులు సోదరులు ఎలిపే ప్రభాకర్ గారు ప్రభువు నందు నిద్రించిరి. ఆయన మొదట బిక్కవోలులోను, తదుపరి కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘములోను సభ్యులుగా యుండిరి కుటుంబ సమేతముగా నమ్మకమైన క్రైస్తవ జీవితమును జీవించిరి 9వ తేదీనాడు ఆయన జ్ఞాపకార్థ స్తుతికూటము వారి స్వగృహమునందు జరిపించిరి. బంధువులు, మిత్రులు, పలు సంఘముల సభ్యులు హాజరై ఆయన విడిచి వెళ్లిన సతీమణి సువార్తమ్మ గారిని, కుటుంబసభ్యులను ఆదరించిరి.

కాకినాడ సత్యవాణి నుండి అనేకులు బైబిలు కరస్పాండెన్సు కోర్సు చేయుచు బైబిలు గ్రంథమును ఉచితముగా పొందుచున్నారు. మీరు కూడ మీ సంఘ సభ్యులను, కుటుంబసభ్యులను ఆ కోర్సులో చేర్పించండి.


RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2021-2023

**సత్యవాక్కు**

పోస్టుబాక్సు - 80
కాకినాడ - 533001
ఆంధ్రప్రదేశ్

ప్రచురణ తేది : ప్రతీ నెల 9వ తేదీ
పోస్టు చేయు తేదీ : ప్రతీ నెల 15వ తేదీ

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్, ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ - 533004